

ఎమ్మెల్యే వివేకానంద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్

కుత్బుల్లాపూర్ ప్రజలకు రుణపడి ఉంటా..

జీడిమెట్ల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ గంపలబస్తీ, రాంరెడ్డినగర్, ఎస్ఆర్‌నాయక్‌నగర్, అపురూపాకాలనీ, మోడీ బిల్డర్స్, జనప్రియసాయినెస్ట్ అపార్ట్‌మెంట్స్‌లలో కృతజ్ఞతయాత్రలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించిన ఆయన, అఖండ విజయంతో నాపై మరింత భారం పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బి.రంగారావు,టీటీకే శ్రీనివాస్, చంద్రశేఖర్‌గౌడ్, మన్సూర్ అలీ, ఎండీ.ఇస్మాయిల్, గుబ్బల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ జగన్

జీడిమెట్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నానని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కె.జగన్ పేర్కొన్నారు. శుక్రవారం షిర్డి హిల్స్‌లో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం బస్తీల్లో పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దాసు, కొండయ్యసాగర్, రామకృష్ణసాగర్, ప్రభాకర్, శ్యామ్, రాజు విమలదేవి, శోభా నాయక్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ఉర్సు ప్రతీక



ఉర్సు ఉత్సవాల్లో కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

గచ్చిబౌలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ఉర్సు ప్రతీక అని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. గురువారం రాత్రి గోపీనగర్‌లోని ఖ్వాజగరీబ్ నవాజ్ దర్గాలో నిర్వహించిన ఉర్సు ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. సందల్ ఊరేగింపు భక్తిశ్రద్ధలతో సాగింది. ప్రత్యేక చాదర్ సమర్పించారు. దర్గా నిర్వాహకులు కార్పొరేటర్‌ను సన్మానించారు.

కోర్టు ఆర్డర్ పత్రాలు చూపి కబ్జాలు

- బంధం చెరువు, కొత్తచెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు
- రెవెన్యూ అధికారులకు సీపీఐ వినతి పత్రం

గాజులరామారం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కోర్టు పత్రాలు ఉన్నాయంటూ ప్రభుత్వ భూమిని కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారి రేణుకకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ గాజులరామారం,జగద్గిరిగుట్ట,సూరారం ప్రాంతాల్లో కొంతమంది కబ్జాదారులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సర్వేనెంబరు 12లో దేవేందర్‌నగర్ డబుల్‌బెడ్ రూమ్‌ల వద్ద సర్వేనెంబరు 329,326, 342ల్లో కొత్తగా ఇళ్లు వెలుస్తూ కోర్టు ఆర్డర్ ఉందంటూ కబ్జా చేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే కబ్జాదారులు బహిరంగంగా రెచ్చిపోతున్నారని, గతంలో ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను అధికారులు తూతు మంత్రంగా కూల్చి వేసి చేతులు దులుపు కుంటున్నారన్నారు. బంధం చెరువు, కొత్తచెరువు ఎఫ్‌టీఎల్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్, ప్రవీణ్, సదానంద్, హిమాం, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఈ సారు.. బదిలీ కారూ...

బాలానగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మూడేళ్లు ఒకేచోట పనిచేసిన ప్రభుత్వ అధికారులను బదిలీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. అయితే ఇది కొందరి విషయంలో సాధ్యపడుతున్నట్టు కనిపించడం లేదు. ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతో కొందరు బదిలీ కాకుండా అక్కడే తిష్టవేసి అక్రమాలకు పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తోన్నా ఎవరు పట్టించుకోవడం లేదని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా డీఆర్‌డీవోకు బదిలీపై వెళ్లిన ఓ అధికారి అక్కడ అక్రమాలకు పాల్పడి, అనంతరం బదిలీపై 2016లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2023లో సస్పెండ్ అయిన ఆ అధికారి 10 రోజులు కరీంనగర్ జైలులో ఉన్నాడు. అనంతరం బయటకు వచ్చిన అధికారి తిరిగి అదే పోస్టులో కొనసాగుతున్నాడు. అవినీతి ఆరోపణలు, ఒకే చోట మూడేళ్లకు మించి పనిచేస్తున్నా... సదరు అధికారిని ఎందుకు బదిలీ చేయడంలేదని జిల్లా పరిశ్రమల కేంద్రంలో పనిచేస్తున్న పలువురు చర్చించుకుంటున్నారు. మరి ఉన్నత అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.



ఈ నెల 28న దుర్గంచెరువు వద్ద 'ఇనార్బిట్ దుర్గం చెరువు రన్ 2024' నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన అధికారిక జెర్సీ, రేస్ రూట్, మెడల్, చారిటీ బిబ్‌లను శుక్రవారం మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో విడుదల చేశారు. మూడు విభాగాల్లో రన్ నిర్వహించి రూ.6 లక్షల వరకూ నగదు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ ట్రాఫిక్ టి.శ్రీనివాసరావు, విమెన్ సేఫ్టీ డీసీపీ సృజన, రహేజా కార్ప్ సీఓఓ శ్రవణ్ గోనె, ఇనార్బిట్ మాల్ హైదరాబాద్ సెంటర్ హెడ్ శరత్ బెలవాడి తదితరులు పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి)

చిత్తారమ్మ.. దీవించమ్మా...

● ప్రారంభమైన జాతర



గణపతి పూజ నిర్వహిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

షాపూర్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే తల్లి 'చిత్తారమ్మ' జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం 8గంటలకు గణపతి హోమం, 8.30కి పుణ్యావచనం, 9గంటలకు పంచగవ్యప్రాసన, 10గంటలకు మంటపారాధన, దీక్షాధారణ, 11కి అగ్ని ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. గాజుల రామారంలోని చిత్తారమ్మ ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజలు చేశారు.

అమ్మవారికి పట్టు వస్త్రాలు ...

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ ప్రజల ఇలవేల్పుగా భావించే చిత్తారమ్మ తల్లి దీవెనలు, ఆశీస్సులు ప్రజలందరిపై మెండుగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కూన అంతయ్యగౌడ్, కేకేఎం ట్రస్ట్ ఛైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాచకొండ బాల్‌రాజ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న శ్రీశైలంగౌడ్

రిసోర్స్ పర్సన్‌ల వేతనాలు పెంచాలి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్పీలు

దుండిగల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (ఎంఈపీఎంఎ) ఆర్పీలకు వేతనాలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు అందజేసి, సమస్యలు పరిష్కరించాలని రిసోర్స్ పర్సన్‌లు కోరారు. శుక్రవారం వారు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. 2023 నుంచి సెప్టెంబర్ వరకు నెలకు రూ.4వేలు చొప్పున.. 2023 అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు రూ. 6 వేల చొప్పున ఉన్న పెండింగ్ వేతనాలను ఇప్పించాలని వారు ఎమ్మెల్సీని కోరారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పడిన తరువాత గత ప్రభుత్వం 2018లో నెలకు రూ. 4 వేల గౌరవ వేతనం అమలు చేసింది. ఆ తరువాత సెప్టెంబర్ 2023న జీఓ నెంబరు 756 ద్వారా మరో రూ.2 వేలు పెంచి రూ. 6 వేలుగా ఉత్తర్వులు ఇచ్చారు. మహిళా సంఘాలు ద్వారా పొదుపు అలవాట్లను స్థానికంగా ఉన్న మహిళలకు అవగాహన కల్పించి, వారికి బ్యాంకులు, శ్రీనిధి ద్వారా ఋణాలు ఇప్పించి, నూటికి నూరు శాతం శక్తి వంచన లేకుండాపని చేస్తున్నామని ఎమ్మెల్సీకి వివరించారు. అవసరమైన సర్వేలు చేస్తూ, సమగ్రమైన సమాచారం ప్రభుత్వాని అందిస్తున్నాం. ప్రస్తుతం మాకు ఇచ్చే గౌరవ వేతనం మేము తిరగడానికి కూడా సరిపోవడం లేదని మావాస్తవ పరిస్థితుల పరిశీలించి ప్రభుత్వం ద్వారా న్యాయం చేసే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్సీని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అధ్యక్షురాలు ఎం. శ్యామల, ఆర్పీలు రాణి, మహేశ్వరి, రేఖ, అనూరాధ, రేణుకా, శివనాగేశ్వరి, భవాని, సులోచన, లత, స్వరూపా, ఉమారాణి, నిర్మల, ఆదిలక్ష్మి, అనంతమ్మ, మంజుల, మమత, అశ్విని, అరుణ, రమ్య, నీరజ, లక్ష్మి ఉన్నారు.

22న శ్రీరామచంద్ర విజయోత్సవ రథయాత్ర

మైసమ్మ ఆలయంలో హారతితో ప్రారంభం



మాట్లాడుతున్న మహాశ్రింగ్ దాసు

నల్లకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్(ఇస్కాన్) కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం, ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న శ్రీరామచంద్ర విజయోత్సవ రథయాత్ర నిర్వహిస్తున్నామని ఆ శాఖ అధ్యక్షుడు మహాశ్రింగ్ దాసు వెల్లడించారు. శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కూకట్‌పల్లి హైదర్‌నగర్‌లో మైసమ్మ ఆలయంలో హారతితో రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. నిజాంపేట చౌరస్తా, జేఎన్‌టీయూ, వివేకానందనగర్, క్రోమా షోరూం మీదుగా హుండా పార్కింగ్ వద్ద రథయాత్ర ముగుస్తుందన్నారు. యాత్రలో పాల్గొనే భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఇస్కాన్ కూకట్‌పల్లి శాఖ సభ్యులు వెంకటేశ్వరరావు, సునీల్‌రాఠీ, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

భవనం పై నుంచి పడి కార్మికుడి మృతి

హైదర్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి కిందపడిన కార్మికుడు మృతిచెందాడు. ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన దేవ్‌బ్రత్‌బెహారా(18) ఇస్లాం అనే మెస్త్రీ వద్ద కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భగత్‌సింగ్‌నగర్‌లోని ఓ నిర్మాణంలో ఉన్న భవనం 3వ అంతస్తులో ఫాల్ సీలింగ్ పనులు చేస్తే అక్కడే పడుకొన్నాడు. శుక్రవారం ఉదయం నిద్రమత్తులో కిందపడగా తలకు తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతిచెందాడు. కేపీహెచ్‌బీ పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గృహిణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ రామ్‌నారాయణ వివరాల ప్రకారం.. రాఘవేంద్ర ఎరోనాటికల్ ఎన్‌క్లేవ్‌లో ఉంటున్న సన్నీతో గజ్జల సాయిశశి(26) వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. భార్యభర్తల మధ్య గొడవల కారణంగా సాయిశశి మూడేళ్ల నుంచి తల్లి కళావతి ఇంటి వద్ద ఉంటుంది. భర్త, పిల్లలు దూరంగా ఉండడంతో మనస్తాపానికి గురైన సాయిశశి గురువారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందింది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో ట్రాన్స్‌జెండర్..

గాజులరామారం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ట్రాన్స్‌జండర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సూరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజీవ్‌గృహకల్పలో నివాసముంటున్న లింగమార్పిడి చేసుకున్న స్రవంతి(35), సురేష్‌లు భార్యభర్తలు. వీరుభిక్షాటన చేస్తుంటారు. ఈనెల 18న ఇద్దరికి గొడవ జరిగింది. భర్త సురేష్ బయటకు వెళ్లిన తర్వాత స్రవంతి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జగద్గిరిగుట్టలో బైక్ దొంగ అరెస్ట్

జీడిమెట్ల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌లను దొంగిలించి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీరాం నగర్‌కు చెందిన బోయమహేష్(19) జగద్గిరిగుట్ట, కేపీహెచ్‌బీలోని వేర్వేరు ప్రాంతాల్లో ఐదు బైక్‌లు దొంగతనం చేసి వాటిని అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. శుక్రవారం అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్టు అంగీకరించాడు. అతని నుంచి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకుని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

- పరారీలో ఇద్దరు

కూకట్‌పల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి మెడలోని బంగారు చైన్ తెంచుకొని పారిపోయిన ఘటనలో నిందితుడ్ని కూకట్‌పల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భాగ్యనగర్‌కాలనీకి చెందిన శివచంద్ ఈనెల 17న రాత్రి 11గంటల సమయంలో నడుచుకొంటూ ఇంటికి వెళ్తుండగా... గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ఆటోలో వచ్చి అతని మెడలోని దాదాపు 10 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా... ఎల్లమ్మబండకు చెందిన షేక్ వరీస్(22)గా గుర్తించారు. శుక్రవారం అతడిని అరెస్టు చేసి బంగారు గొలుసు స్వాధీనం చేసుకొన్నారు. మిగతా ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. వరీస్ కూకట్‌పల్లిలోని ఓ షాపింగ్‌మాల్‌లో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



హెల్మెట్ ధరించని వాహనదారులకు గులాబీ పూలు అందజేస్తున్న పోలీసులు

పేట్‌బషీరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆర్టీఏ అధికారులు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఈ మాసోత్సవాలు వచ్చే నెల 14 వరకు నిర్వహించనున్నట్లు డీటీఓ కిషన్ తెలిపారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించండి మీ గమ్యాన్ని సురక్షితంగా చేరుకోండి అని వాహన దారులకు సూచించారు. అనంతరం హెల్మెట్ లేకుండా రోడ్లపై వెళ్తున్న వాహనదారులకు గులాబీ పువ్వులు, హెల్మెట్ ధరించిన వారికి చాకెలెట్స్‌ను అందజేస్తూ వినూత్న కార్యాక్రమాన్ని నిర్వహించారు. రంగారెడ్డి డివిజన్‌లోని ఐడీపీఎల్ డీమార్టు సమీపంలో బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ ట్రాఫిక్ జోన్ సైబరాబాద్ అడిషనల్ డీసీపీ శ్రీనివాసులు, బాలానగర్ ఏసీపీ సురేష్‌లు సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనదారులకు అడిషనల్ డీసీపీ శ్రీనివాసులు పలు సూచనలు, సలహాలు చేశారు. పాదచారులు రోడ్లపూ ఫోన్ మాట్లాడుతూ నడవద్దని, జీబ్రాక్రాసింగ్, సిగ్నల్‌ను గమనించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలపై వాహదారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ బుక్ లేకుండా రోడ్లపై వాహనాలు నడపొద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

బీజేపీ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా హరీశ్‌రెడ్డి



హరీశ్‌రెడ్డి

ఓల్డుబోయినపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా పన్నాల హరీశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన నియమకానికి సంబంధించి శుక్రవారం పార్టీ అధిష్టానం ప్రకటన విడుదల చేసింది. రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన హరీశ్‌రెడ్డికి పార్టీ నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

నేడు, రేపు ఓటరు నమోదుకు అవకాశం

కూకట్‌పల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఓటురు జాబితాలో పేర్లు నమోదు చేసుకొనేందుకు ఎన్నికల కమిషన్ మరోసారి అవకాశం కల్పించింది. ఈనెల 20, 21తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల పరిధిలోని అన్నీ పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బంది అందుబాటు ఉండేలా ఏర్పాట్లు చేశారు. నూతనంగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని, చిరునామా మార్పు, నియోజకవర్గం మార్పు, పేర్లలో తప్పులు సరిదిద్దండం వంటి అంశాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 8న తుదిఓటరు జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.

నిజాంపేట, దుండిగల్, కొంపల్లిలో....

దుండిగల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపల్‌లో పరిధిలో శనివారం నుంచి రెండు రోజులపాటు ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరూ ఓటరు జాబితాలో పేరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపల్ పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌లలో బూత్‌లెవల్ అధికారులు, బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, తప్పులు, అడ్రస్ మార్పు తదితర వివరాలు సరిచేసుకోవాలన్నారు.

రోడ్లపక్కన వ్యర్థాలు డంప్ చేస్తే జరిమానా

- కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష

కూకట్‌పల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ వ్యర్థాలను ఇష్టానుసారంగా రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో డంపింగ్ చేస్తే జరిమానా విధిస్తామని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఓ ప్రకటనలో తెలిపారు. యూజర్ చార్జీలు చెల్లించి జీహెచ్ఎంసీ కేటాయించిన డంపింగ్ కేంద్రాలకు మాత్రమే వ్యర్థాలను తరలించాలని ఆమె సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నట్లు జెడ్సీ తెలిపారు. నిబంధనలు పాటించని ప్రైవేటు ట్రక్కులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మూసాపేట, కూకట్‌పల్లి, గాజులరామారం, కుత్బుల్లాపూర్, అల్వాల్ సర్కిళ్లకు సంబంధించిన వ్యర్థాలు డీసీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. వివరాలకు లక్ష్మీరెడ్డి 8374478220, శశివర్ధన్‌రెడ్డి 8712604625 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.



ఎన్‌టీఆర్ స్టేడియంలో యాగం ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

రేపటి నుంచి కోటి ప్రత్యాంగిర మహాయాగం

కవాడిగూడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జగద్గురు సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి 88వ అవతరణోత్సవం సందర్భంగా శ్రీ సిద్దేశ్వర పీఠం కుర్తాళం ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ స్టేడియంలో ఈనెల 21 నుంచి 28 వరకు దేశంలోనే తొలిసారిగా 108 హోమకుండాలతో 25 వేల కిలోల ఎండు మిరపకాయలతో కోటి ప్రత్యాంగిర మహాయాగాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, పీఠం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మోచెర్ల శశిభూషణ్, ధర్మాధికారి వల్లూరు శివకోటేశ్వర రాజు. కోఆర్డినేటర్ మునిపల్లె శ్రీనివాస్, పీఠం పురోహితులు మాచవోలు రమేష్‌శర్మ తెలిపారు. శుక్రవారం యాగం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ, ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకు యాగం, సాయంత్రం 6.30 గంటలకు భక్తి సంగీతం, శ్రీ లలిత, శ్రీ విష్ణు, సౌందర్య లహరి, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం ఉంటాయని తెలిపారు. రాత్రి 7.30 గంటలకు వివిధ దేవతామూర్తుల కల్యాణ మహోత్సవం, శ్రీ సిద్దేశ్వరానంద భారతి అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. కార్యక్రమాలకు హాజరైన మొదటి పది వేల మంది భక్తులకు వివిధ దేవతల రూపు. కాసు, రుద్రాక్షలను ప్రసాదంగా అందజేస్తామని వారు వెల్లడించారు. కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులను ఆహ్వానిస్తామని వారు తెలిపారు. కోటి ప్రత్యాంగిర మహాయాగంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు, రేపు రాష్ట్ర వ్యాప్తంగా టైపు రైటింగ్ పరీక్షలు

- షార్ట్ హ్యాండ్ పరీక్షలు 28న

తార్నాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ, ఎస్.బి.టెట్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21న రాష్ట్ర వ్యాప్తంగా టైపు రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాలిగ తెలిపారు. శుక్రవారం తార్నాకలోని టైపు రైటింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 పరీక్షా కేంద్రాల్లో తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ బాషల్లో జూనియర్ గ్రేడ్, లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్, హై స్పీడ్ విభాగాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని, షార్ట్‌హ్యాండ్ పరీక్షలు ఈ నెల 28న ఇంగ్లిష్, తెలుగు బాషల్లో నిర్వహిస్తామని తెలిపారు. టైపు రైటింగ్, షార్ట్‌హ్యాండ్‌లో శిక్షణ పూర్తి చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే సర్టిఫికెట్లు పొందే వారికి కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు, హైకోర్టు, కిందిస్థాయి కోర్టుల్లో, ప్రైవేట్ ఉద్యోగాల్లో అవకాశాలు లభిస్తాయని, ఆసక్తిగల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేశం, ఫణికుమార్, రాజేశ్వర్, బాలరాజు, రామేశ్వరా చారి, ఓం ప్రకాష్, నాగశ్రీ పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా డంప్‌చేస్తే కఠిన చర్యలు: జడ్‌సీ



అధికారులతో మట్లాడుతున్న జోనల్ కమిషనర్ స్నేహ షబరీష్

గచ్చిబౌలి/చందానగర్/గచ్చిబౌలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఇష్టానుసారంగా భవన నిర్మాణ వ్యర్థాలు డంపింగ్ చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ స్నేహషబరీష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. వెస్ట్‌జోన్ పరిధిలోని దాదాపు అన్ని సర్కిళ్లలో నిర్మాణ వ్యర్థాలు రోడ్లవెంబడి డంప్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రోడ్లపై వ్యర్థాలను పారబోస్తున్న వాహనాలను గుర్తించి సీజ్ చేయలన్నారు. సంబంధించిన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన స్నేహ షబరీస్‌ను జనసేన శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ డాక్టర్ మాధవరెడ్డి, మదర్‌సేవా సమితి వ్యవస్థాపక ఛైర్మన్ బద్దం కొండల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కొండల్‌రెడ్డి శుక్రవారం ఆమెకు వినతి పత్రం అందజేశారు. చందానగర్, శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్లు, సిటీప్లానర్, రెండు సర్కిళ్లకు చెందిన టౌన్‌ప్లానింగ్ అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కళా సిల్క్ ప్రదర్శన



సిల్క్ ఎక్స్‌పోలో మహిళలు

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కొలన్ నారాయణరెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ వస్త్రప్రదర్శన (ఎగ్జిబిషన్ అండ్ సేల్)కు విశేష స్పందన వస్తోందని నిర్వాహకులు వినోద్ నేగి, సంజయ్ కుమార్‌లు తెలిపారు. మేళాలో దుస్తులు, బెడ్‌షీట్స్, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు నిజాంపేట పరిసర కాలనీల ప్రజలు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు.

కళా సిల్క్ ప్రదర్శనలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, బ్లాక్ ప్రింటెడ్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, మహిళల ఫ్యాన్సీ టాపులు, డిజైనర్ బ్లౌజులు, ఖాదీ మెటీరియల్, ఒన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, హైదరాబాద్ ముత్యాలు, చెప్పులు తదితర ఉత్పత్తులు తక్కువ ధరలకే అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.